**లంచగొండుల వివరాలు ఏసిబికి తెలపండి**

ప్రభుత్వ ఉద్యోగులు, అధికారులు ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నట్లు, లంచగొండితనానికి పాల్పడుతున్నట్లు ఎలాంటి సమాచారమున్నా అవినీతి నిరోధక శాఖకు తెలయజేయ వలసిందిగా ఎసిబి డైరెక్టర్ జనరల్ ప్రజలను కోరారు. సమాచారం అలందించిన వారుపేరు, వివరాలను గోప్యంగా ఉంచుతామని ఒక ప్రకటనలో తెలిపారు.

**వివరాలకు:**

డైరెక్టర్ జనరల్, అవినీతి నిరోధక శాఖ,
మొజంజాహి మార్కెట్ రోడ్, హైద్రాబాద్ -500 001
ఫోన్:(040) 2475132, 247456,24745626



# దేశ టైమ్స్

DESHA TIMES
TELUGU DAILY
VOLUME: 16 ISSUE:152

తెలుగు దినపత్రిక


## వచ్చేసిన డెంగీ టీకా..

ముంబై, ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా మారిన డెంగీ మహమ్మారి నివారణకు భారత్ లో సరికొత్త ఆయుధం అందుబాటు లోకి వచ్చింది. దేశంలోనే మొట్టమొదటి డెంగీ నివారణ వ్యాక్సిన్ 'క్యుడెంగా' విడుదలకు భారత ఔషధ నియంత్రణ సంస్థ అధికారికంగా అనుమతి మంజూరు చేసింది. ఈ వ్యాక్సిన్‌ను జపాన్‌కు చెందిన ప్రముఖ గ్లోబల్ బయోఫార్మాస్యూటికల్ కంపెనీ 'తకేడా' అభివృద్ధి చేసింది. డెంగీ నివారణ కోసం మన దేశంలో డీసీజీఐ ఆమోదం పొందిన తొలి టీకా ఇదే కావడం గమనార్హం.తకేడా బయో ఫార్మాస్యూటికల్స్ ఇండియా అందించిన వివరాల ప్రకారం, 4 సంవత్సరాల వయస్సు నుండి 60 సంవత్సరాల వయస్సు వరకు ఉన్నవారందరూ ఈ 'క్యుడెంగా' వ్యాక్సిన్ తీసుకోవడానికి అర్హులు. ముఖ్యంగా, గతంలో డెంగీ బారిన పడిన వారైనా లేదా అసలు డెంగీ సోకని వారైనా సరే.. ఎవరైనా ఈ టీకాను నిర్భయంగా తీసుకోవచ్చు. సాధారణంగా కొన్ని రకాల వ్యాక్సిన్లు ఇచ్చే ముందు రక్తం లేదా ఇతర పరీక్షలు చేయాల్సి ఉంటుంది.


నల్లగొండ సంపుటి: 16 సంచిక :172 ఎడిటర్ : సయ్యద్ పాష తేది: గురువారం 23-07-2026 పేజీలు:4 వెల: 1.00


# నీట్ లీక్ నిప్పురాజేసిన వేళ లోక్‌సభలో 'కిరణ్' స్పష్టత...



న్యూఢిల్లీ,దేశవ్యాప్తంగా లక్షలాది మంది వైద్య విద్యార్థుల భవిష్యత్తును తీవ్ర గందరగోళంలోకి నెట్టిన 'నీట్' ప్రశ్నాపత్రాల లీకేజీ ఉదంతం పార్లమెంట్‌ను తీవ్రంగా కుదిపేస్తోంది. గత కొన్ని రోజులుగా ఉభయ సభలను ఉనికిలోకి రానివ్వకుండా విపక్షాలు పట్టుబడుతున్న వేళ, కేంద్ర ప్రభుత్వం ఎట్టకేలకు ఈ అంశంపై కీలక ప్రకటన చేసింది. "నీట్ వ్యవహారంపై చర్చకు మేం సంపూర్ణంగా సిద్ధం!" అంటూ పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు లోక్‌సభ వేదికగా స్పష్టం చేశారు. గత మూడు రోజులుగా తాము ఇదే విషయాన్ని చెబుతున్నామని, అయితే చర్చ ఏ నిబంధన కింద జరగాలనేదే అసలు సమస్యని పేర్కొన్నారు. విపక్షాల హోరెత్తించే నిరసనల మధ్య ప్రభుత్వం ఈ ప్రకటన చేయడం వెనుక ఉన్న రాజకీయ వ్యూహమేమిటి? అసలు ఏ నిబంధన కింద చర్చ జరగాలని కేంద్రం పట్టుబడుతోంది? ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్న వాయిదా తీర్మానానికి, ప్రభుత్వ ప్రతిపాదనకు మధ్య ఉన్న వ్యత్యాసమేమిటి? లోక్‌సభలో కిరణ్ రిజిజు స్పష్టత: నిబంధనల ప్రకారమే చర్చ : బుధవారం లోక్‌సభ సమావేశాలు ప్రారంభం కాగానే విపక్షాలు నీట్ వివాదంపై నినాదాలతో హోరెత్తించాయి. సభ సజావుగా సాగేందుకు వీలుగా స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రి కిరణ్ రిజిజుకు మాట్లాడే అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడగా, దేశ యువత భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీ అంశంపై చర్చించేందుకు ప్రభుత్వం ఏనాడూ వెనకడుగు వేయలేదని స్పష్టం చేశారు. లక్షలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆందోళనను గుర్తించి, గత మూడు రోజులుగా ప్రభుత్వం చర్చకు సిద్ధమేనని అధికారికంగా ప్రతిపాదిస్తూనే ఉందన్నారు. అయితే, పార్లమెంట్ నియమావళి, నిర్దేశిత వ్యవధి ప్రకారమే ఈ చర్చ జరగాల్సి ఉంటుందని తేల్చి చెప్పారు.కిరణ్ రిజిజు కీలక వ్యాఖ్యలు: "గత మూడు రోజులుగా సభలో చర్చకు సిద్ధమని పదే పదే చెబుతున్నాం. చర్చ ఎప్పుడు జరగాలి? ఎంత సమయం కేటాయించాలి? ఏ నిబంధన కింద చేపట్టాలి? అన్నది స్పీకర్ నిర్ణయించాలి. అన్ని రాజకీయ పక్షాల సభా పక్ష నేతలతో బిజినెస్ అడ్వైజరీ కమిటీ లో మాట్లాడిన తర్వాతే రూల్ నిర్ణయించాలి. కేవలం ఆరోపణలకే పరిమితం కాకుండా, దేశ యువతకు లబ్ధి చేకూరేలా అర్థవంతమైన, నిర్మాణాత్మక చర్చ జరగాలన్నదే ప్రభుత్వ ఉద్దేశం".అగ్గికి ఆజ్యం పోసిన ప్రతిపక్షాల డిమాండ్లు : కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు వివరణ ఇచ్చినప్పటికీ, ప్రతిపక్షాలు తమ నిరసనలను విరమించలేదు. సభలో మిగతా కార్యకలాపాలన్నింటినీ పక్కనబెట్టి, 'వాయిదా తీర్మానం' కింద వెంటనే నీట్ అక్రమాలపై చర్చ చేపట్టాలని కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, ఇతర ఇండియా కూటమి భాగస్వామ్య పక్షాలు పట్టుబట్టాయి.కాంగ్రెస్ ఎంపీ కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని, పరీక్షల నిర్వహణలో వైఫల్యానికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. మరోవైపు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ జోక్యం చేసుకుంటూ, ఇది రాజకీయ ప్రయోజనాలకు అతీతమైన అంశమని వ్యాఖ్యానించారు.. వీధుల్లోకి వచ్చి పోరాడుతున్న విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్వయంగా సభలో ప్రకటన చేయాలని పట్టుబట్టారు.ప్రతిపక్షాల వరుస నినాదాలు, పోడియం వద్దకు దూసుకొచ్చి చేసిన నిరసనల కారణంగా లోక్‌సభ కార్యకలాపాలు తీవ్రంగా స్తంభించాయి. స్పీకర్ ఓం బిర్లా సభను అదుపులోకి తెచ్చేందుకు ప్రయత్నించినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో సభను మధ్యాహ్నానికి వాయిదా వేయాల్సి వచ్చింది.ప్రభుత్వ వ్యూహం – నిబంధనల చిక్కు ముడి : ఈ వ్యవహారంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును గమనిస్తే, చర్చకు సిద్ధమని చెబుతూనే నిబంధనల ప్రక్రియను ముందుకూ తెస్తోంది. సభలో సజావుగా చర్చ సాగాలంటే నిబంధన 193 (రాతపూర్వక చర్చ) లేదా ఇతర సాధారణ నిబంధనల కింద మాత్రమే చర్చ జరగాలని అధికార పక్షం భావిస్తోంది. అయితే, వాయిదా తీర్మానం కింద చర్చ చేపడితే ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగట్టవచ్చని, ఓటింగ్ పొందే అవకాశాలు కూడా ఉంటాయని విపక్షాలు పట్టుబడుతున్నాయి.ఈ నేపథ్యంలో పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి స్పీకర్‌ను అభ్యర్థిస్తూ–అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లతో ఒక ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి, తేదీ, సమయం,

# హరీష్ రావుకు పూర్తి స్వేచ్ఛ ఇస్తే !?



హైదరాబాద్,హరీష్ రావు సొంత నియోజకవకర్గం సిద్ధిపేటలో చేసిన పాదయాత్ర ఇప్పుడు హాట్ టాపిక్. కేవలం పదిహేను కిలోమీటర్లు చేసిన పాదయాత్రతో రాష్ట్రం మొత్తం చూపు తన వైపునకు తిప్పుకున్నారు. తెలంగాణ రాజకీయాల్లో ట్రబుల్ షూటర్ గా, పక్కా మాస్ లీడర్‌గా తన్నీరు హరీష్ రావుకు ఉన్న క్రేజ్, క్యాడర్ బేస్ ప్రత్యేకం. ఉద్యమ సమయం నుంచి నేటి వరకు పార్టీకి ఏ కష్టం వచ్చినా ముందు వరుసలో నిలబడి పరిష్కరించడం ఆయన శైలి. తాను ఎప్పుడూ ఉన్నత పదవులకో, ఆధిపత్యానికో ఆశపడలేదని, అధినాయకత్వపు నిర్ణయాలకు కట్టుబడి ఉంటానని ఆయన ఎన్నో సార్లు స్పష్టం చేశారు. అయినప్పటికీ, బీఆర్ఎస్ శ్రేణులను బలహీనపరచడానికి, అధినాయకత్వానికి–హరీష్‌రావుకు మధ్య అనుమానాల బీజాలు నాటడానికి ప్రత్యర్థి వర్గాలు నిరంతరం విచిత్రమైన ఊహాగానాలను సృష్టిస్తూనే ఉంటాయి. ఈ రాజకీయ సమీకరణల వల్లే కావచ్చు.. ప్రస్తుతం హరీష్ రావు పాత్రను అధినాయకత్వం కేవలం తన సొంత నియోజకవర్గానికో, ఉమ్మడి మెదక్ జిల్లాకో పరిమితం చేస్తోంది.

హరీష్ బలాన్ని బీఆర్ఎస్ ఎందుకు వాడుకోదు?

రాజకీయాల్లో క్షేత్రస్థాయి బలం ఉన్న నాయకుడి పవర్ ఏంటో హరీష్ రావు ఇటీవలి తన సిద్ధిపేట పాదయాత్రల ద్వారా మరోసారి నిరూపించారు. కాళేశ్వరం నీళ్లు, రైతాంగ సమస్యలపై ఆయన కేవలం ఒక మండల స్థాయిలో పిలుపునిస్తేనే వేలాదిగా జనం తరలివచ్చారు. ఏ మీడియా బిల్డప్‌లు, సోషల్ మీడియా ప్రచారాలు లేకుండా నేరుగా ప్రజలతో ఉండే ఈ లైవ్ కనెక్టివిటీ యే ఆయన అసలైన బలం. సోషల్ మీడియా హడావుడికే పరిమితమైన నేతల మధ్య, రోడ్డెక్కి పోరాటం చేసే మాస్ లీడర్‌గా ఆయనకున్న గుర్తింపు చెక్కుచెదరలేదు. అయితే, ఈ స్థాయి క్రేజ్ చూసిన ప్రతిసారీ సొంత పార్టీలోనే కొందరు వ్యతిరేకులు ఆయనపై ముద్రలు వేయడం, ఆయన సైలెంట్ అయితే పార్టీపై అలిగారని ప్రత్యర్థులు ప్రచారం చేయడం ఒక పరిపాటిగా మారింది.

హరీష్‌కు బాధ్యతలు పెంచితే పూర్వ వైభవం

బీఆర్ఎస్ ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా పునర్వైభవం కోసం పోరాడుతున్న తరుణంలో, హరీష్ రావు సేవలను కేవలం ఒక జిల్లాకే పరిమితం చేయడం వ్యూహాత్మక తప్పిదమేనని భావిస్తున్నారు. హరీష్ రావుకు ఎలాంటి సరిహద్దు ఆంక్షలు విధించకుండా, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బాధ్యతలు అప్పగిస్తే బీఆర్ఎస్ క్యాడర్‌లో వచ్చే ఊపు అసాధారణంగా ఉంటుంది. తెలంగాణలోని ప్రతి నియోజకవర్గంలోనూ ఆయనకు అభిమానులు, అనుచరులు ఉన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ప్రజా సమస్యలపై నిలదీయడంలో గానీ, క్షేత్రస్థాయిలో కేడర్‌ను సమాయత్తం చేయడంలో గానీ హరీష్‌కున్న రాజకీయ చాకచక్యం అపారమైనది.

హరీష్‌ను కావాలనే కట్టడి చేస్తున్నారు!

కానీ, ఈ నిర్ణయం తీసుకోవడానికి బీఆర్ఎస్ అధినాయకత్వం వెనుకంజ వేయడానికి అంతర్గత కుటుంబ, వారసత్వ రాజకీయ సమీకరణలే ప్రధాన కారణమని అందరికీ తెలుసు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కేటీఆర్ ఉన్నందున , హరీష్ రావు మాస్ ఇమేజ్ దాన్ని డామినేట్ చేస్తుందేమోననే ముందస్తు ఆందోళనలు, భయాలు ఉండవచ్చు. వారి అంతర్గత ప్రాధాన్యతలు ఏవైనప్పటికీ, అధికారంలో లేని సమయంలో పార్టీకి అత్యంత అవసరమైన అస్త్రాన్ని సిద్ధంగా పెట్టుకుని పూర్తిస్థాయిలో వాడుకోకపోవడం గులాబీ దళానికి తీవ్ర నష్టం కలిగిస్తుందనడంలో సందేహం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ధీటుగా ఎదుర్కోవాలన్నా, కిందిస్థాయి కార్యకర్తల్లో ఉత్సాహం నింపాలన్నా హరీష్ రావుకు స్వేచ్ఛాయుతమైన రాష్ట్ర స్థాయి బాధ్యతలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. ప్రజా సమస్యలపై పోరాడే శక్తి, పక్కా వ్యూహాలు రచించే నైపుణ్యం ఉన్న నాయకుడికి పరిమితులు విధించడం వల్ల పార్టీ తన సొంత బలాన్నే తగ్గించుకున్నట్లవుతోంది. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకత్వం ధైర్యం చేసి, హరీష్ రావును రాష్ట్రవ్యాప్త పర్యటనలకు, పోరాటాలకు నాయకత్వం వహించేలా ముందువరుసలో నిలబడితేనే.. తెలంగాణలో గులాబీ జెండా మళ్లీ పూర్తిస్థాయిలో ఊపందుకుంటుంది.

# రబీ సీజన్ ధాన్యం కొనుగోళ్లపై కేంద్రం మరో ప్రకటన

హైదరాబాద్,తెలంగాణ రైతన్నలకు ప్రయోజనం చేకూర్చేలా కేంద్ర ప్రభుత్వం తెలంగాణలో ధాన్యం సేకరణ విషయంలో కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో అదనంగా వడ్లను కొనుగోలు చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రైతుల్లో ఆనందం వెల్లువెత్తుతోంది. రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా 8 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని పెంచేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. సవరించిన వరి కొనుగోలు అంచనా బియ్యం రూపంలో 43 లక్షల మెట్రిక్ టన్నులుగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి మరియు బండి సంజయ్ హర్షం

తెలంగాణ నుండి అదనపు బియ్యం సేకరణకు కేంద్రం తీసుకున్న నిర్ణయం పట్ల కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రైతుల మేలు కోసం, బీజేపీ ప్రజాప్రతినిధుల విజ్ఞప్తులకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకోవడం సంతోషకరమని వారు తెలిపారు. ఈ నిర్ణయంతో రాష్ట్రంలోని రైతులకు ఎంతో మేలు జరుగుతుందని నాయకులు అభిప్రాయపడ్డారు.

43 లక్షల మెట్రిక్ టన్నులకు బియ్యం సేకరణ పెంపు

ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ 2025–26కు సంబంధించి, సీజన్ ప్రారంభానికి




ముందే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారుల సమక్షంలో తెలంగాణ నుండి 35 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరించాలని సంయుక్తంగా నిర్ణయించారు. తెలంగాణలో వరి ధాన్యం ఉత్పత్తిని దృష్టిలో పెట్టుకుని, బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేశాము. మా విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం, బియ్యం సేకరణ లక్ష్యాన్ని 35 లక్షల మెట్రిక్ టన్నుల నుండి 43 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచుతూ నిర్ణయం తీసుకుంది.

# దేశ యువత భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోంది



హనుమకొండ : దేశ యువత భవిష్యత్తును కేంద్ర ప్రభుత్వం అంధకారంలోకి నెడుతోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం హనుమకొండలో డీసీసీ జిల్లా అధ్యక్షుడు ఇనుగాల వెంకట్రాంరెడ్డి ఆధ్వర్యంలో ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక, అప్రజాస్వామిక విధానాలపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశంలో సామాన్య ప్రజలు, విద్యార్థుల తరఫున ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ప్రతిపక్ష నాయకులను అక్రమంగా అరెస్టు చేయించడం బీజేపీ అహంకారానికి పరాకాష్ట అని ఆయన మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం ఎన్ని అణచివేత చర్యలకు పాల్పడినా కాంగ్రెస్ పార్టీ భయపడదని, ప్రజల తరఫున పోరాటాన్ని ఆపే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు.దేశవ్యాప్తంగా కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ కావడం కేంద్ర ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమని అన్నారు. ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు అన్యాయం చేస్తూ, ప్రశ్నాపత్రాలను అమ్ముకుంటున్న విద్యా మాఫియాకు ఈ ప్రభుత్వం కొమ్ముకాస్తోందని విమర్శించారు. విద్యా వ్యవస్థను పూర్తిగా భ్రష్టుపట్టించిన కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన మంత్రి పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, టీపీసీసీ సభ్యులు కుచ్చాన రావలి, ఇవి శ్రీనివాస్ రావు, భట్టి శ్రీనివాస్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్ ఖాన్, మాజీ మేయర్ గుండు సుధారాణి, ఏనుమాముల మార్కెట్ చైర్‌పర్సన్ పులి ప్రియాంక, కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ పింగిలి వెంకట్రామ్ నర్సింహారెడ్డి, వరంగల్ పార్లమెంట్ ఇన్‌చార్జ్ నాసీర్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

# తనను ఓడించేందుకు బీజేపీ-బీఆర్ఎస్ భారీ కుట్రలు-సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్,తప్పులు ప్రశ్నిస్తున్నందుకు బీఆర్ఎస్–బీజేపీ పార్టీలు తనపై కుట్ర చేస్తున్నారని ఆరోపించారు సీఎం రేవంత్‌రెడ్డి. రాష్ట్ర స్థాయిలో తనను దెబ్బతీయాలంటే తన పునాదులపై ఆ రెండు పార్టీలు భారీ స్కెచ్ వేశాయని అన్నారు. పేర్లు వేరైనా బీఆర్ఎస్–బీజేపీ రెండూ ఒక్కటేనని తేల్చి చెప్పారు. ఓటరు జాబితా సమగ్ర సవరణపై బుధవారం బీఎల్ఏలతో కొడంగల్‌లో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి ఈ వ్యాఖ్యలు చేశారు.కొడంగల్‌లో సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు–కొడంగల్ ప్రజలు, కార్యకర్తల ఆశీర్వాదంతో రాష్ట్రానికి నాయకత్వానికి వహించే అవకాశం మనకు వచ్చిందన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ సానుభూతిపరుల ఓట్లు తొలగించాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఇంట్లో పొగ పెడితే తాను బయటకు రాకుండా ఉంటానని కుట్రలు చేస్తున్నారని దుయ్యబట్టారు. తన ఎదురు నిలబడలేక ఇలాంటి ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు.ఓడించేందుకు బీజేపీ–బీఆర్ఎస్ కుట్రలు–కొడంగల్‌లో కుట్రలు చేసేవారిని బొంద పెట్టే బాధ్యత మీపై ఉందన్నారు ముఖ్యమంత్రి. ఆగస్టు 3 వరకు ఓటరు జాబితా సమగ్ర సవరణSIR గడువు ఉందన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,96,620 ఓట్లు ప్రక్షాళన అయ్యాయని, ఇంకా నమోదు చేసుకోనివారి సంఖ్య 54,635 ఓట్లు ఉన్నాయన్నారు. మొత్తం ఓట్లలో ఇంకా 22 శాతం నమోదు కాలేదన్నారు. ఆ ఓట్లను తొలగిస్తే ప్రమాదం పొంచి ఉందన్నారు.ఓట్లు తొలగించేందుకు ఈ రెండు పార్టీల భారీ స్కెచ్–వారందరినీ తిరిగి నమోదు చేయించాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందన్నారు సీఎం. ఓటు పోగొట్టుకుంటే మనకు గుర్తింపు ఉండదని, కార్యకర్తగా ఇంటింటికీ వెళ్లి ఓటరు వెరిఫికేషన్ ఫారం నమోదు చేయించాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ–ఎస్టీ–మైనారిటీల ఓట్లు తొలగించాలని బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు.ఓటర్ల వివరాలు ఎన్నికల అధికారులకు



అందించాల్సిన బాధ్యత బూత్ లెవెల్ ఏజెంట్లపై ఉందని, ఈనెల చివరినాటికి నూటికి నూరు శాతం కొడంగల్ నియోజకవర్గంలో ప్రక్షాళన పూర్తి కావాలన్నారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ ఓటరు కోల్పోవడానికి వీల్లేదన్నారు. 119 నియోజకవర్గాలను అభివృద్ధి చేయడం కోసం రోజుకు 18 గంటలు పని చేసినా తనకు సమయం సరిపోవడం లేదన్నారు.ఓటరు జాబితాలో లేకపోతే ప్రభుత్వ సంక్షేమ పథకాలు రావన్న సీఎం, గతంతో పోలిస్తే సరైన వివరాలు లేకపోతే పక్కన పెడుతున్నారని చెప్పుకొచ్చారు. అనుమానాస్పదంగా ఉంటే సరైన ఆధారాలు చూపి ఓటర్లుగా నమోదు చేసుకోవాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఓటు వేసే వారి జాబితా ఇప్పుడే రెడీ అవుతోందన్నారు. కొడంగల్ నియోజకవర్గంలో అర్హులైన వారి ఓట్లు తొలగించేందుకు వీల్లేదన్నారు.అంతకుముందు కొడంగల్‌లో సీఎం రేవంత్ రెడ్డి నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. మంగళవారం ఢిల్లీలో ఏఐసీసీ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీల అరెస్టుకు నిరసనగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆందోళన చేపట్టారు. తన నివాసం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు భారీ ర్యాలీగా తరలివెళ్లిన అక్కడ నిరసనలో పాల్గొన్నారు.

# ధర్మేంద్ర రాజీనామాకు దేశ వ్యాప్తంగా జోరుగా ఆందోళనలు



హైదరాబాద్,నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాచేయాలన్న డిమాండ్ తో ప్రతిపక్షాలు ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ దేశ వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించింది. ధర్మేంద్ర బర్తరఫ్ కు డిమాండ్ చేస్తూ...రాహుల్ గాంధీ అరెస్ట్‌ను నిరసిస్తూ స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి కొడంగల్‌లో ర్యాలీలో పాల్గొన్నారు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి లోక్ భవన్ వరకు పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు నిరసన ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు పాల్గొని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లోక్ భవన్ వైపు వెలుతున్న కాంగ్రెస్ నాయకులను, మంత్రులను, ప్రజాప్రతినిధులను పోలీసులు అడ్డుకోగా ఈ సందర్భంగా తోపులాట సాగింది. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్ కు తరలించారు. పలువురు కాంగ్రెస్ నాయకులు బీజేపీ ఆఫీస్ వైపు వెళ్లడంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు.

విజయవాడలో కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ నిరసనలు

ఏపీలోని విజయవాడలో కాంగ్రెస్ నిర్వహించిన ర్యాలీ ఉద్రిక్తతలకు దారితీసింది. మ్యూజియం రోడ్ లో కాంగ్రెస్ ర్యాలీ సందర్భంగా ఆ పార్టీ కార్యాలయం వద్ద ఉద్రిక్తత తలెత్తింది. ప్రధాని ఇంటి వద్ద ధర్నా చేసిన రాహుల్ గాంధీని అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ ఓ వైపు, ప్రధానమంత్రి ఇంటి ముందు రాహుల్ గాంధీ అరెస్టును నిరసిస్తూ బీజేపీ పిలుపునివ్వడంతో రెండు పార్టీలు ర్యాలీలకు దిగాయి. మ్యూజియం రోడ్డులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీ చేశారు.రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ డౌన్ డౌన్ అంటూ బీజేపీ కార్యకర్తలు ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యాలయంలోకి దూసుకెళ్లిన బీజేపీ నాయకులను కాంగ్రెస్ కార్యకర్తలు, పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో బీజేపీ, కాంగ్రెస్ నాయకులు పరస్పరం జెండా కర్రలతో కొట్టుకున్నారు. కాంగ్రెస్ ఆఫీస్ పై బీజేపీ కార్యకర్తలు చెప్పులు, రాళ్లు రువ్వారు. పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టాయి.

ఢిల్లీలో కొనసాగుతున్న విద్యార్థుల ఆందోళనలు

నీట్ పేపర్ల లీకేజీకి,విద్యా వ్యవస్థలో లోపాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ తో కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరసనలు బుధవారం కూడా ఉధృతంగా కొనసాగాయి. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసే వరకు ఉద్యమం ఆపేది లేదంటూ విద్యార్థులు స్పష్టం చేశారు.కేంద్రం నిర్లక్ష్యం ఇదే రీతిలో కొనసాగితే దేశవ్యాప్తంగా యువత హస్తినను ముట్టడిస్తుందని హెచ్చరించారు. నిరసనకారులకు దేశవ్యాప్తంగా మద్దతు పెరుగుతుండటంతో ఆందోళనలు తీవ్రతరం అవుతున్నాయి.

# జెన్ జీ జపంలో గులాబీ




హైదరాబాద్, తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు తెరలేస్తోంది. ఇప్పటిదాకా గ్రామీణ ఓటర్లు, రైతాంగ సమస్యలు, ఉచిత విద్యుత్, ధాన్యం కొనుగోళ్ల చుట్టూనే తమ రాజకీయ వ్యూహాలను తిప్పిన ఃఖీూ, ఇప్పుడు రూట్ మార్చింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నాయకత్వంలో యువత, నిరుద్యోగులే లక్ష్యంగా ఒక పక్కా పొలిటికల్ రోడ్‌మ్యాప్‌ను సిద్ధం చేస్తోంది. తాజాగా హైదరాబాద్‌లోని సరూర్ నగర్‌లో నిర్వహించిన 'యువ సంగ్రామ సదస్సు' బీఆర్ఎస్ రాబోయే రాజకీయ కార్యాచరణకు ప్రత్యక్ష నిదర్శనంగా నిలిచింది. ఊహించని స్థాయిలో తరలివచ్చిన యువత, ఉద్యోగ నోటిఫికేషన్లు, జాబ్ క్యాలెండర్ అమలుపై వ్యక్తం చేసిన నిరసన ప్రభుత్వంపై ఎంతటి అసంతృప్తి ఉందో స్పష్టం చేసింది. ఈ జనాగ్రహాన్ని క్యాచ్ చేస్తూ, నిరుద్యోగ సమస్యననే రాబోయే రోజుల్లో తమ ప్రధాన రాజకీయ అస్త్రంగా మార్చుకోవాలని బీఆర్ఎస్ డిసైడ్ అయింది. ఈ వ్యూహంలో అత్యంత ఆసక్తికరమైన అంశం? జాతీయ, అంతర్జాతీయ పరిణామాలను స్థానిక రాజకీయాలకు కేటీఆర్ జోడించిన తీరు!

ఇటీవల నేపాల్‌లో యువత చేపట్టిన 'జెన్ జీ మూవ్‌మెంట్' సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. సరిగ్గా ఇదే పాయింట్‌ను కేటీఆర్ తన డిజిటల్ వ్యూహంలో భాగం చేసుకున్నారు. పది నెలల క్రితం తాను చేసిన ఒక ట్వీట్‌ను రీట్వీట్ చేస్తూ "ప్రభుత్వాలు జెన్ జీ, యువత ఆకాంక్షలను నిర్లక్ష్యం చేస్తే పరిణామాలు ఎలా ఉంటాయో ప్రపంచ పరిణామాలే నిదర్శనం" అని పేర్కొన్నారు. నిరుద్యోగ తిరుగుబాటును తాను ముందే ఊహించాననే చర్చకు ఇది గట్టి పునాది వేసింది. బీఆర్ఎస్ కొత్త స్ట్రాటజీ వెనుక కొన్ని ముఖ్యమైన అంశాలున్నాయి. కేవలం పల్లెలు, రైతులకే పరిమితం కాకుండా పట్టణాల్లోని గ్రాడ్యుయేట్లు, విద్యార్థులు, ఉద్యోగార్థులను తమ వైపు తిప్పుకునే స్కెచ్ ఉంది. గ్రూప్ ఎగ్జామ్స్ రద్దు, నోటిఫికేషన్ల లీకేజీలు, నియామకాల జాప్యం వంటి అంశాలపై నిరుద్యోగుల్లో ఉన్న ఆక్రోశానికి నాయకత్వం వహించడం ద్వారా వాళ్లకు తాము అండగా ఉన్నామనే భరోసా కల్పిస్తున్నారు. సోషల్ మీడియాలో నిమిషాల్లో ట్రెండ్స్ మార్చే తాజా తరం మద్దతు కూడగట్టడం ద్వారా క్షేత్రస్థాయిలో పెను మార్పులు తీసుకురావాలనేది దీని వెనుక ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది. రాబోయే రోజుల్లో ప్రతి జిల్లా కేంద్రంలో నిరుద్యోగ నిరసనలు, యువజన సదస్సులు నిర్వహించేందుకు బీఆర్ఎస్ బ్లూప్రింట్ సిద్ధం చేస్తోంది. గతంలో సాధించిన రైతాంగ పోరాట అనుభవానికి, ఇప్పుడు యువత ఉద్రేకాలను జతచేసి భవిష్యత్తులో ప్రభుత్వంపై తీవ్రమైన ఒత్తిడి పెంచడమే కేటీఆర్ ప్రధాన లక్ష్యం. అయితే, కేవలం అధికార పక్షాన్ని విమర్శించడమే కాకుండా, తాము మళ్లీ వస్తే యువత సమస్యలకు ఎలాంటి పరిష్కారం చూపుతామో నమ్మించడమే బీఆర్ఎస్ ముందున్న అసలైన సవాలు. మరి కేటీఆర్ ప్రయోగించిన ఈ జెన్ జీ కార్డ్ ఏ స్థాయిలో వర్కవుట్ అవుతుందో, గులాబీ దళానికి పూర్వవైభవం తెచ్చిపెడుతుందో లేదో వేచి చూడాల్సిందే!

# వరంగల్ విమానాశ్రయానికి రూ.497 కోట్లు



వరంగల్,తెలంగాణలోని వరంగల్ మామ్నూర్ విమానాశ్రయ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మామునూరు ఎయిర్‌పోర్టును రూ. 496.86 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసేందుకు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టులో భాగంగా రన్‌వే, అప్రాన్, ట్యాక్సీవే మరియు బౌండరీ వాల్ నిర్మాణం వంటి మౌలిక వసతుల పనుల కోసం ప్రాథమిక టెండర్లను కూడా ఏఏఐ విడుదల చేసింది. మామ్నూర్ విమానాశ్రయ నిర్మాణ పనులు భూసేకరణ, అవసరమైన అనుమతుల ప్రక్రియ పూర్తయిన తర్వాతే వేగవంతం కానున్నాయి. మామునూరు ఎయిర్‌పోర్టు ప్రారంభమయ్యే సమయం పూర్తిగా భూసేకరణ ప్రక్రియ పూర్తయ్యే సమయంపైనే ఆధారపడి ఉంటుందని కేంద్ర పౌర విమానయాన శాఖ స్పష్టం చేసింది. రాజ్యసభలో అడిగిన ఒక ప్రశ్నకు లిఖితపూర్వకంగా సమాధానమిస్తూ కేంద్రం ఈ వివరాలను వెల్లడించింది. వరంగల్ ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా రూ. 496.86 కోట్ల అంచనాతో అనుమతులు మంజూరు చేసినట్లు కేంద్ర పౌర విమానయానశాఖ సహాయమంత్రి మురళీధర్ మొహోల్ తెలిపారు. రాజ్యసభలో కాంగ్రెస్ సభ్యులు వేం నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌లు అడిగిన ప్రశ్నలకు ఈ సమాధానం ఇచ్చారు. ఎయిర్ పోర్ట్ నిర్మాణం పూర్తయ్యే సమయం అనేది భూసేకరణ, చట్టబద్ధమైన అనుమతులపై ఆధారపడి ఉంటుందన్నారు. ఉడాన్ స్కీమ్ కింద తెలంగాణ నుంచి ఇప్పటివరకు 58 విమాన మార్గాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఆదిలాబాద్ ఎయిర్‌పోర్టుకు సంబంధించి టెక్నో-ఎకనామిక్ ఫీజిబిలిటీ అధ్యయనాన్ని ఏఏఐ ఇప్పటికే పూర్తి చేసి, అక్కడ అవసరమయ్యే భూమి వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపింది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలపై స్పందించారు.. ఆదిలాబాద్ ఎయిర్ పోర్ట్ ఉమ్మడిగా ఉపయోగించుకోవడానికి ఉన్న అవకాశాలపై ఏఏఐ అధ్యయనం చేసి, అవసరమైన భూమి వివరాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్లు మంత్రి తెలిపారు. పెద్దపల్లిలో ప్రీ-ఫీజిబిలిటీ నివేదికను ఫిబ్రవరిలోనే సమర్పించినట్లు చెప్పారు. అయితే, భద్రాద్రి కొత్తగూడెంలోని రామవరం, చెంచుపల్లి, సుజాతనగర్ పరిధిలోని స్థలాల్లో ఏఏఐ విచారణ జరపగా, అక్కడ ఉన్న కొండలు, రైల్వే లైన్ల కారణంగా విమానాశ్రయ నిర్మాణం సాధ్యం కాదని తేల్చిచెప్పినట్లు వివరించారు. తెలంగాణలో కొత్తగా ఎలాంటి మెట్రో రైలు ప్రాజెక్టులకూ కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ రాజ్యసభలో బీజేపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రశ్నకు సమాధానంగా తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫస్ట్ ఫేజ్ రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానంలో అమలు చేసిందని, ఇప్పటివరకు ఈ ప్రాజెక్టుకు వయబిలిటీ గ్యాప్ ఫండ్ కింద కేంద్ర ఆర్థిక శాఖ రూ. 1,204 కోట్లు విడుదల చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం ఎలాంటి మెట్రో ప్రాజెక్టూ అమల్లో లేదని స్పష్టం చేశారు.

# విశాఖలో రియల్ షాక్

విశాఖపట్టణం, ఉత్తరాంధ్ర రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాజెక్ట్ ఒక గేమ్ ఛేంజర్‌గా మారిన మాట వాస్తవమే. అయితే, దీనిని ఆసరాగా చేసుకుని విశాఖ నగర శివారైన ఆనందపురం జంక్షన్ నుండి పద్మనాభం, భోగాపురం వెళ్లే కారిడార్లలో భూముల ధరలు ఇప్పుడు ఊగిసలాడుతున్నాయి. విమానాశ్రయ పనులు శరవేగంగా సాగుతుండటంతో ఇన్వెస్టర్లు ఇటువైపు మొగ్గు చూపుతారనే అంచనాలతో రేట్లు విపరీతంగా పెంచేసారు. కానీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి పరిశీలిస్తే.. ఆ రేట్లకు, ఇక్కడి వాస్తవ మార్కెట్ డిమాండ్‌కు అస్సలు పొంతన లేకపోవడంతో ధరల్లో భారీ హెచ్చుతగ్గులు కనిపిస్తూ, కొనుగోలుదారులను అయోమయంలో పడేస్తున్నాయి. ఈ ప్రాంతంలో ధరలు స్థిరంగా ఉండకపోవడానికి ప్రధాన కారణం కొందరు బ్రోకర్లు, స్థానిక డెవలపర్లు సృష్టించిన ఊహాజనిత మార్కెట్ మాత్రమే. భోగాపురం ఎయిర్‌పోర్ట్ వచ్చేస్తోంది కాబట్టి రాత్రికి రాత్రే ఇక్కడ భూముల విలువ కోట్లకు చేరుతుందనే కలరింగ్ ఇచ్చి, ల్యాండ్ రేట్లను అమాంతం ఆకాశానికి చేర్చారు. ఎకరం లేదా గజం ధరను వాస్తవ విలువ కంటే మూడు, నాలుగు రెట్లు పెంచి బోర్డులు పెట్టారు. అయితే, ఈ విపరీతమైన హైప్ కారణంగా సామాన్య, మధ్యతరగతి కొనుగోలుదారులు ఈ జోన్ వైపు రావడమే మానేశారు. దీని ఫలితంగా.. ఆనందపురం, పద్మనాభం లోపలి పరిసరాల్లో వెలిసిన కొన్ని వెంచర్లు ఇప్పుడు కస్టమర్లు లేక వెలవెలబోతున్నాయి. ప్రారంభంలో భారీ ఆర్భాటంతో, ఆకర్షణీయమైన బ్రోచర్లతో ప్లాట్ల అమ్మకాలు జరిపినప్పటికీ.. ఇప్పుడు అక్కడ



కొనే నాథుడే కరువయ్యాడు. మున్సిపల్ అనుమతులు లేకుండా, కేవలం పంచాయతీ లేఅవుట్లతో వేసిన వెంచర్లలో పెట్టుబడి పెడితే భవిష్యత్తులో చిక్కులు వస్తాయని ఇన్వెస్టర్లు గ్రహించడంతో ఈ పరిస్థితి తలెత్తింది. ఆర్టిఫిషియల్ హైప్‌తో పెరిగిన రేట్లు కాస్తా.. ఇప్పుడు డిమాండ్ లేక ఒక్కసారిగా కిందికి పడిపోతున్నాయి. అందుకే ఈ కారిడార్‌లో పెట్టుబడి పెట్టాలనుకునే వారు తీవ్ర అప్రమత్తతతో వ్యవహరించాలని మార్కెట్ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆనందపురం-పద్మనాభం బెల్ట్‌లో భవిష్యత్తు ఉన్నప్పటికీ.. కేవలం ఎయిర్‌పోర్ట్ సెంటిమెంట్‌ను నమ్మి అడ్డగోలు ధరలకు అన్-అప్రూవ్డ్ ప్లాట్లు కొని ఇరుక్కోవద్దని సూచిస్తున్నారు

# పంజాబ్ పై కమలం గురి



ఛండీఘడ్,పంజాబ్‌లో గతంలో నిరాశాజనకంగా ఉన్న ఫలితాలను పక్కనబెట్టి, బీజేపీ ఇప్పుడు పూర్తి ఆత్మవిశ్వాసంతో అధికారంలోకి రావాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కేవలం రెండు సీట్లతో నాలుగో స్థానంలో నిలిచిన పార్టీ, వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో నంబర్ వన్‌గా ఎదగాలని సన్నద్ధమవుతోంది. ఇది కేవలం ఆశావాదం కాదు, సంస్థాగతంగా, సామాజికంగా బలపడేందుకు చేస్తున్న క్రమబద్ధమైన ప్రయత్నం. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి 4 శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం 18 శాతం ఓట్లు సాధించింది. ఈ తేడాను గమనించిన బీజేపీ నాయకత్వం,అసెంబ్లీ ఎన్నికల్లో కనీసం 25 శాతం ఓట్లు సాధించగలిగితే అధి కారం సాధ్యమని అంచనా వేస్తోంది. వచ్చే ఎన్నికల్లో నాలుగు పార్టీల మధ్య తీవ్ర పోటీ ఉండనుంది కాబట్టి, ఇది బీజేపీకి అనుకూలంగా మారే అవకాశం ఉంది. ఆరు నెలల్లో రెండుసార్లు పంజాబ్‌ను సందర్శించిన ప్రధాని నరేంద్ర మోదీ ఈ వ్యూహానికి కేంద్ర బిందువుగా మారారు. ఫిబ్రవరిలో డేరా సచ్చండ్ సందర్శన చేశారు. ఈ శ్రమాన్ని సందర్శించిన తొలి ప్రధాని మోదీనే. జూలైలో రవిదాస్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించడం. రెండు చర్యలు ఒకే లక్ష్యంతో ఉన్నాయి. రవిదాసీలు, దళితులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో బీజేపీ ప్రభావాన్ని పెంచడం. రవిదాస్ పేరుతో రైలు ప్రారంభం, రవిదాసీ సమాజానికి ప్రత్యేక గుర్తింపు ఇవ్వడం వ్యూహాత్మకమైనది. పంజాబ్‌లో మాజా, మాల్వా, దువా అనే మూడు ప్రధాన భౌగోళిక ప్రాంతాలున్నాయి. మాజా కాంగ్రెస్‌కు, మాల్వా ఆప్‌కు బలమైన ప్రాంతాలు. దువా ప్రాంతంలోని 24 నియోజకవర్గాల్లో దళితులు ముఖ్యంగా రామగడియాలు, రవిదాసీలు ఎక్కువగా ఉన్నారు. ఈ ప్రాంతంలోనే మోదీ పర్యటనలు కేంద్రీకృతమయ్యాయి. దళిత ఓటర్లను ఆకర్షించడం ద్వారా బీజేపీ తన ఓటు బేస్‌ను విస్తరించాలని చూస్తోంది. జూలై పర్యటనలో ప్రధాని తేజాసింగ్ సముంద్రి వంటి సిక్కు సంస్కర్త గురించి ప్రస్తావించడం కూడా ముఖ్యమైనది. సిక్కు సమాజంలోని ఒక వర్గం ఆయనను మరచిపోయినా, ఆయన నాయకత్వంలో జరిగిన ఉద్యమాలను గుర్తు చేయడం ద్వారా బీజేపీ సిక్కుల్లోనూ మంచి సంబంధాలు ఏర్పరచుకోవాలని ప్రయత్నిస్తోంది. దళితులు సిక్కు సంస్కరణవాదులు అనే కలయిక ద్వారా విస్తృతమైన సామాజిక మద్దతు సాధించాలనేది ఉద్దేశం. బీజేపీ కార్యకర్తలు నియోజకవర్గాల వారీగా జనాభా, చారిత్రక నేపథ్యం, సామాజిక సంబంధాలు, బీజేపీకి ఉన్న అడ్డంకులను వివరంగా అధ్యయనం చేస్తున్నారు. జర్నలిస్టులు, విశ్వవిద్యాలయ ప్రొఫెసర్లు, మేధావులు, మాజీ రాజకీయ నాయకులు, బ్యూరోక్రాట్లు, సామాజిక నాయకులతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఇటీవల లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీకి చెందిన అశోక్ కుమార్ మిత్తల్, రాఘవ్ చెద్దా వంటి నాయకులు బీజేపీలో చేరడం ఈ ప్రక్రియకు మరింత బలం చేకూర్చింది. బెంగాల్‌లో అనుసరించిన సంస్థాగత వ్యూహాలను ఇక్కడ కూడా అమలు చేయాలని యోచిస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోందిపంజాబ్ సరిహద్దు రాష్ట్రం కావడం, మిగిలిన సరిహద్దు రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉండడం ఈ ప్రయత్నానికి అదనపు ప్రేరణ. అయితే ఆప్ మాల్వాలో, కాంగ్రెస్ మాజాలో బలంగా ఉన్నాయి. స్థానిక సమస్యలు, ప్రాంతీయ రాజకీయాలు బీజేపీ ముందు సవాళ్లుగా ఉన్నాయి. దళిత ఓటర్లను ఆకర్షించడం ద్వారా ఈ సవాళ్లను అధిగమించాలని బీజేపీ భావిస్తోంది. మొత్తంమీద బీజేపీ ఇప్పుడు చేస్తున్నది కేవలం ఎన్నికల ప్రచారం కాదు. ఇది దీర్ఘకాలిక సంస్థాగత విస్తరణ, సామాజిక సమీకరణ, మరియు వ్యూహాత్మక ఓటర్ టార్గెటింగ్ కలయిక.

### తాడిపత్రి టీడీపీ నేత జేసీ ప్రభాకర్ రెడ్డి వీరంగం

తాడిపత్రి,తాడిపత్రిలో టీడీపీ నేస జేసీ ప్రభాకర్ రెడ్డి హల్ చల్ చేసారు. వైసీపీ నేత చిదంబర్ రెడ్డి ఇంటి వద్దకు అనుచరులతో వెళ్లి హంగామా చేసారు. పెద్దవడగూరు మండలంలో మాజీ జెడ్పీటీసీ చిదంబర్ రెడ్డి వైసీపీ కీలక నేతగా ఉన్నారు. వైసీపీ నేత చిదంబర్ రెడ్డిని ఊరువదిలి వెళ్లిపోవాలని జేసీ ప్రభాకర్ రెడ్డి ఇప్పటికే వార్నింగ్ ఇచ్చారు. జేసీ రెడ్డి బెదిరింపులపై అనంతపురం ఎస్పీ జగదీష్ కు వైసీపీ నేత చిదంబర్ రెడ్డి పిర్యాదు చేసారు.

# రాహుల్ గ్రాఫ్ పెరుగుతోందా...రీజన్ ఏంటి ?

న్యూఢిల్లీ,మోడీ వర్సెస్ రాహుల్ అన్నది గత మూడు ఎన్నికలుగా దేశంలో సాగుతూ వస్తోంది. ఒక్కో ఎన్నికకూ కాంగ్రెస్ తన సీట్ల ఓట్ల షేర్ ని పెంచుకుంటూ కూడా వస్తోంది. దేశంలో లీడర్ ఆఫ్ అపోజిషన్ మీద ఎపుడూ ప్రజలకు ఒక ఫోకస్ ఉంటుంది. ఆయనను తరువాత కాలానికి ప్రధానిగా కూడా చూస్తారు. కొన్ని దేశాలలో అయితే వెయిటింగ్ ప్రైమ్ మినిస్టర్ గా అపోజిషన్ లీడర్లను పేర్కొంటారు. ఇక భారత్ లో రాహుల్ గాంధీ రాజకీయ నేపథ్యం, ఆయన వంశీకుల చరిత్ర, ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఇవన్నీ చూసుకున్నపుడు రాహుల్ గాంధీ ప్రైమ్ మినిస్టర్ క్యాండిడేట్ అన్నది ఎక్కువ మంది అభిప్రాయపడతారు. అయితే నరేంద్ర మోడీ ఇమేజ్ ముందు రాహుల్ గాంధీ కొంత తగ్గినట్లుగా గడచిన ఎన్నికలలో కనిపించారు. మోడీ వర్సెస్ రాహుల్ అన్నది గత మూడు ఎన్నికలుగా దేశంలో సాగుతూ వస్తోంది. ఒక్కో ఎన్నికకూ కాంగ్రెస్ తన సీట్ల ఓట్ల షేర్ ని పెంచుకుంటూ కూడా వస్తోంది.

ఆ ఎన్నికలు కీలకంగా :

ఇదిలా ఉంటే 2024లో ఇండియా కూటమి సమిష్టిగా 232 సీట్లు కైవసం చేసుకుంది. ఇక కాంగ్రెస్ సొంతంగా 99 సీట్లు గెలుచుకుంది. 2019లో కేవలం 52 సీట్లు మాత్రమే గెలుచుకున్న దానితో పోలిస్తే ఇది గణనీయంగా మెరుగుపడిందని చెప్పాలి. ఈ కూటమిలోని భాగస్వామ్య పక్షాలలో ఒకటి అయిన సమాజ్‌వాదీ పార్టీ ఉత్తర ప్రదేశ్‌లోని 80 స్థానాలకు గాను 37 స్థానాలను గెలుచుకుని అక్కడ ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. మిగిలిన మిత్రులు కూడా 2024 లో మంచి రాజకీయ ప్రదర్శన ఇవ్వడంతో ఇండియా కూటమి అధికారానికి సరిపడా అవసరమయ్యే మ్యాజిక్ ఫిగర్ 272 కి 40 సీట్ల దూరంలో నిలిచింది. మరో వైపు చూస్తే బీజేపీ నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి ఎన్డీయే మొత్తం 292 సీట్లు గెలుచుకుంది. ఇండియా బ్లాక్ కి ఎన్డీయేకి మధ్య తేడా కేవలం 50 సీట్లు మాత్రమే. ఇందులో బీజేపీ సొంతంగా 240 సీట్లు మాత్రమే గెలుచుకున్న క్రమంలో మిత్రుల సాయం తీసుకోక తప్పింది కాదు.

రెండేళ్ళలో మార్పుగా :

ఇక మూడవసారి మోడీ ప్రభుత్వంలో కేంద్రంలో అధికారంలో ఉంది. టోటల్ గా చూస్తే పన్నెండేళ్ళుగా మోడీ ప్రధానిగా ఉన్నారు. ఆ ప్రభుత్వంలో అనేక మెరుపులు ఉన్నాయి, విరుపులూ ఉన్నాయి. ఇక 2029 నాటికి పదిహేనేళ్ళు పూర్తి చేసుకోనున్న ఎన్డీయే ప్రభుత్వానికి గణనీయమైన అవకాశాలనే దేశ ప్రజలు కట్టబెట్టారు అన్న అభిప్రాయం కూడా అంతటా ఉంది. ఇంకో విషయం ఏమిటి అంటే బీజేపీ రెండు టెర్ముల కంటే మూడవ టెర్ములో ప్రభుత్వ విజయాలు పెద్దగా లేవన్న భావన కూడా వ్యక్తం అవుతోంది, కొత్త పథకాలు కానీ కొత్తగా అభివృద్ధి కార్యక్రమాలు కానీ ప్రచారం చేసుకోదగిన స్థాయిలో లేవని అంటున్నారు.

యువతలో అసహనం :

ఇక ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. అదే సమయంలో ప్రైవేట్ రంగంలో కోతలు ఉంటున్నాయి. ప్రభుత్వ విధానం చూస్తే ప్రైవేట్ రంగం విస్తరించాలని ఆలోచన ఉంది. అక్కడ ఉపాధి సృష్టి జరుగుతుందని భావించినా ఆశించిన స్థాయిలో అది లేదని అంటున్నారు. ఇక



ఏఐ వంటి కొత్త సాంకేతికత వచ్చిన తరువాత ప్రైవేట్ లో ఉపాధి అవకాశాలు ఇంకా తగ్గుతాయని అంటున్నారు. వీటిని అన్నింటి నేపథ్యంలో నిరుద్యోగ యువతలో అసహనం మొదలైంది అని అంటున్నారు. లేకపోతే పేరూ ఊరూ లేని ఒక వాట్సప్ పార్టీ ఇచ్చిన పిలుపునకు యువత ఉవెత్తి రావడం అంటే ఆషామాషీ వ్యవహారం కాదని అంటున్నారు.

రాహుల్ వ్యూహాలు :

మోడీ 56 ఏళ్ళ యువకుడు అని రాహుల్ గాంధీని సెటైరికల్ గా విమర్శించినా కూడా యువతతో రాహుల్ గాంధీ బాగానే కనెక్ట్ అవుతున్నారు. ఆయన తనదైన వ్యూహాలతో యువత నాడి పట్టే ప్రయత్నం చేస్తున్నారు. సరిగ్గా ఇక్కడే మోడీ వర్సెస్ రాహుల్ పోలిక రాహుల్ కి కలసి వస్తోంది. మోడీ అనుభవం ముందు రాహుల్ మూడు ఎన్నికల్లో తేలిపోవడం అంతా చూశారు. కానీ జెన్ జీ తరం ఇపుడు కొత్త ఆలోచనలతో ముందుకు వస్తోంది. అపుడు వారికి రాహుల్ లో యూత్ లీడర్ కనిపించడం యాధృచ్ఛికమైనదిగానే చూడాల్సి ఉంటుంది అని విశ్లేషిస్తున్నారు. అదే సమయంలో బీజేపీ ప్రవచిస్తున్న ఫిలాసఫీ కూడా కొత్త తరానికి ఆకట్టుకునే అంశాలుగా ఉండే అవకాశాలు తక్కువగా ఉన్నాయని అంటున్నారు.

కచ్చితంగా ఆల్టర్నేషన్ వైపుగా :

మరో వైపు రైతులు ప్రధాన సెక్షన్ గా ఉన్నారు. వారు కూడా ప్రభుత్వం మీద అసంతృప్తిగా ఉన్నారని అంటున్నారు. మరో ఉద్యమానికి వారు సిద్ధపడుతున్నారు. ఇక ధరల పెరుగుదల ఇతరత్రా అంశాల మీద సగటు జనంలో ఆవేదన పెరుగుతోంది. మంచి ఉద్దేశ్యంతో అమలు చేస్తున్నామని చెప్పినా సర్ ప్రక్రియ మాత్రం తమ ఓటు పోయేలా చేస్తోంది అన్న బెంగ సామాన్యుడిలో ఉంది. పెట్రోల్ లో ఇథనాల్ మిక్సింగ్ కూడా వారిని కలవరం పరచేదిగా ఉంటోంది. ఇంకా చెప్పాలీ అంటే దేశీయంగా అనేక సమస్యలు ఉన్నాయి. బీజేపీ విదేశీ విజయాలు కానీ దేశ రక్షణ రంగంలో తీసుకున్న నిర్ణయాలు కానీ వచ్చే ఎన్నికలలో ఏ మేరకు ప్రభావితం చేస్తాయి అన్నది కూడా చూడాలి, అదే సమయంలో దేశంలో పెరుగుతున్న సమస్యలే సామాన్యుడికి ముఖ్యమనుకున్నపుడు విభిన్న వర్గాలలో అసంతృప్తి పెరిగినపుడు కచ్చితంగా ఆల్టర్నేషన్ వైపుగా చూస్తారు. అదే రాహుల్ గాంధీకి ప్లస్ అవుతోంది అని ఆయన గ్రాఫ్ ఇటీవల కాలంలో పెరగడానికి అదే కారణం అని అంటున్నారు.

# గంటా ఎంపీ ఫోకస్...నిజమేనా ?



అమరావతి,విశాఖ జిల్లాకు చెందిన మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు రాజకీయ విరమణ చేస్తారని ఒక వైపు అంటున్నా ఆయన తగ్గేది ఉండదని మరో వైపు ప్రచారం సాగుతోంది. ఆయన ప్రస్తుతం భీమిలీ నుంచి ఎమ్మెల్యేగా టీడీపీ తరఫున ఉన్నారు. 2014లో భీమిలీ నుంచి తొలిసారి గెలిచి అయిదేళ్ళ పాటు టీడీపీ ప్రభుత్వంలో మంత్రి పదవిని నిర్వహించిన గంటా 2019లోనూ అదే సీటు కోరుకున్నారు. కానీ అధినాయకత్వం సూచనలతో ఆయన విశాఖ ఉత్తర నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలిచారు. ఇక 2024లో పట్టుబట్టి మరీ తిరిగి భీమిలీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు. మంత్రి పదవి వస్తుందని ఊహిస్తే అది జరగలేదు. విస్తరణ మీద ఆశలు అయితే ఉన్నాయి. ఇవన్నీ పక్కన పెడితే ఆయన 2029 ఎన్నికల మీద కూడా ఇప్పటి నుంచే ఆలోచన చేస్తున్నారు అని అంటున్నారు.

వారసుడిని బరిలోకి :

ఇక తన కుమారుడిని వారసుడిగా రంగంలోకి ఇప్పటికే గంటా దించేశారు. గంటా రవితేజా పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆయనే భీమిలీ నుంచి పోటీ చేస్తారు అని గంటా వర్గం అయితే గట్టి ధీమాను వ్యక్తం చేస్తోంది. అదే సమయంలో ఈ సీటు మీద జనసేన కన్ను కూడా ఉంది. అలాగే ఆ పార్టీలో చేరి మాజీ మంత్రి అవంతి శ్రీనివాస్ మళ్ళీ భీమిలీ నుంచి రీ ఎంట్రీ ఇస్తారని అంటున్నారు. మరో వైపు టీడీపీలోనే కీలక నేతలు కూడా భీమిలీ నుంచి బరిలో ఉండవచ్చు అన్న ప్రచారమూ సాగుతోంది. అయితే గంటా వర్గం మాత్రం ఈ సీటు తమదే అంటోంది.

ఎంపీగా రంగంలోకి :

ఇక ఆ మధ్యన గంటా తన మనసులో మాటను మీడియా ముందు బయటపెట్టారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ భీమిలీ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తే తాను విశాఖ నుంచి ఎంపీగా పోటీ చేస్తాను అని అన్నారు. అయితే తాను విశాఖ నుంచి ఎంపీగానే 2029లో కూడా ఉంటాను అని అదే మీడియా మీటింగులో భరత్ క్లారిటీ ఇచ్చారు. అయితే వచ్చే ఎన్నికలకు విశాఖ పార్లమెంట్ సీటు మూడుగా మారుతుంది అన్నది ఉంది. లేదా రెండుగా కూడా మారవచ్చు అని అంటున్నారు. విశాఖ సెంట్రల్ పేరుతో కొత్త లఒక్ సభ సీటు వస్తే అందులో భీమిలీ అసెంబ్లీతో పాటు ఇతర నియోజకవర్గాలు ఉంటాయని అంటున్నారు. దాంతో గంటా ఆశలు ఆ విధంగా నెరవేరవచ్చు అని అంటున్నారు.

తొలిసారి ఎంట్రీతోనే :

ఇక గంటా రాజకీయ ప్రస్థానం చూస్తే ఆయన 1999లో టీడీపీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆయన అపుడు అనకాపల్లి ఎంపీగా పోటీ చేసి గెలిచారు. ఆ తరువాత మాత్రం అసెంబ్లీ ఎన్నికల్లోనే పోటీ చేస్తూ వస్తున్నారు. ఆ విధంగా ఆయన మంత్రి కోరిక కూడా తీర్చుకున్నారు. ఇపుడు ఆయన తన సీనియారిటీకి తగినది పార్లమెంట్ లోకి తిరిగి ప్రవేశం అని భావిస్తున్నారు అని ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దాంతో పాటుగా తన కుమారుడికి భీమిలీ ఎమ్మెల్యే టికెట్ కూడా ఆయన కోరుకుంటున్నారు. ఈ విధంగా చూస్తే గంటా కుటుంబంలో కూడా రెండు టికెట్లను పార్టీ ఇవ్వాల్సి ఉంటుందని అంటున్నారు. అంగబలం అర్థబలంతో పాటు రాజకీయ చతురత బాగా ఉన్న గంటా గతంలో తన అనుచరులకు కూడా టికెట్లు ఇప్పించుకుని గెలిపించుకున్నారు. ఇపుడు తన కుటుంబంలో రెండు టికెట్లు ఇప్పించుకోవడం కష్టసాధ్యం కాదని అన్న మాట వినిపిస్తోంది. చూడాలి మరి ఈ ప్రచారంలో ఎంత నిజం ఉందో ఏమవుతుందో అన్నది.

Printed, Published and Owned by SAYED PASHA Printed at MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State, Published From: MUSKAN PRINTERS, H.No. 5-12-391/1/1, Srinivas Colony BTS Nalgonda, Dist. Nalgonda. Pin-508001, Telangana State. Editor: SAYED PASHA, RNI No. RNI NO. TEITEL 2010/34557, Cell: 9849758280